సాక్షి అనకాపల్లి

శనివారం । 16 । నవంబర్ । 2024



పట్టుదలతో చదవాలి

భీమిలి: విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ స్థానిక కేజీబీవీని శుక్రవారం సందర్శించారు. పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు.



క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శన

విశాఖ విద్య: ఏయూలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

త్రిశూల పర్వతంపై

అఖండ జ్యోతి



భక్తులను పులకింపజేసిన అఖండ జ్యోతి



త్రిశూల పర్వతంపై జ్యోతిని వెలిగిస్తున్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి వెలసిన త్రిశూల పర్వతంపై శుక్రవారం రాత్రి అఖండ జ్యోతి భక్తులకు దర్శనమిచ్చింది. కార్తీక మాసం పౌర్ణమి రోజున అరుణాచలంలో ఏవిధంగా అయితే అఖండ జ్యోతి దర్శనమిస్తుందో.. అదే విధంగా త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతి దర్శనానికి ఆలయ కమిటీ వారు ఈ ఏడాది నాంది పలికారు. మొదటి సారిగా దర్శనమిస్తున్న అఖండ జ్యోతిని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ముందుగా బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి భక్తులు బయలుదేరి త్రిశూల పర్వతం చేరుకున్నారు. పర్వతంపై అఖండ జ్యోతి వెలిగించే ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కృత్తిక నక్షత్ర హోమం నిర్వహించారు. పూర్ణాహుతి, మహా నైవేద్యం, ధూపసేవ నిర్వహించి, దూదితో ఒత్తు వేసి దానిలో నెయ్యిపోసి ఒత్తిని ఉంచి జ్యోతిని వెలిగించారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం నుంచి త్రిశూల పర్వతంపై వెలిగించిన జ్యోతికి భక్తులు నమస్కరించుకున్నారు. జ్యోతి వెలిగించి త్రిశూల పర్వతంపై పెద్ద ఎత్తున బాణ సంచా వెలిగించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ చేశారు.



గిరిప్రదక్షిణకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి రథంతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

గిరి ప్రదక్షిణలో

ఆధ్యాత్మిక అనుభూతి

- కార్తీక పౌర్ణమి రోజు మార్మోగిన శివనామస్మరణ
- ఫణిగిరి తొలి ప్రదక్షిణలో వేలాదిగా పాల్గొన్న భక్తులు
- దారిపొడవునా ఉమాధర్మలింగేశ్వర స్వామి రథానికి నీరాజనం పట్టిన గ్రామాల ప్రజలు

పంచాక్షరి ప్రతిధ్వనులతో ఫణిగిరి మార్మోగింది.. హరహర మహాదేవ శంభో శంకర అంటూ వేలాదిమంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. తొలిసారిగా తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమై ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి రథం ముందు నడవగా భక్తులు అనుసరించారు.

రాంబిల్లి (యలమంచిలి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామి కొలువైన ఫణిగిరి చుట్టూ ప్రదక్షిణ చేయాలన్న భక్తుల సంకల్పం నెరవేరింది. శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన 24 కిలోమీటర్ల మేర సాగిన గిరి ప్రదక్షిణలో 10 వేల మందికి పైగా పాల్గొన్నారు. తెల్లవారుజామున 5 గంటలకే ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. పరమ శివుడికి ఆలయ అర్చకులు అందుకూరి సత్యనారాయణ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన అనంతరం శివాలయం ఎదురుగా ఉన్న ఆకాశధార కార్తీక అఖండ జ్యోతిని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వెలిగించి కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ధారభోగాపురం గ్రామం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ యలమంచిలి రోడ్డు కుడి వైపున ఉన్న ధారపాలెం, పంచదార్ల, కొత్తూరు శారదానది బ్రిడ్జి, గోకివాడ, మూలజంప, మడకపాలెం చెర్లోపాలెం, నరేంద్రపురం, మల్లవరం, ఉప్పవరం, ఎర్రవరం, కొండకర్ల జంక్షన్, చోడపల్లి, అచ్యుతాపురం, వెదురువాడ, ఆర్‌అండ్ ఆర్ కాలనీ, గొర్లె ధర్మవరం, వెంకటాపురం జంక్షన్, మీదుగా సాగి ధారభోగాపురం గ్రామంలో ఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్దకు చేరుకుంది. భక్తులు ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొట్టి కార్తీక అఖండ జ్యోతి వెలిగించి, పవిత్ర పుణ్యజలం, తులసి పత్రి రాగి పాత్రలో పోసి తలపై పెట్టుకొని స్వామి వారి రథం వెంట నడిచారు. ప్రదక్షిణ ముగిశాక పవిత్ర పుణ్య ధారల జలాన్ని ఆలయంలో ఉన్న శివలింగాలపై అభిషేకించారు. గిరి ప్రదక్షిణలో రథం వెంట వివిధ గ్రామాలకు చెందిన మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తి గీతాలను ఆలపిస్తూ భక్తులు రథం వెంట సాగారు. సాముగరిడీలు అలరించాయి.



ఆలయ ముఖద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్న భక్తులు



గిరి ప్రదక్షిణలో మహిళల కోలాటం

భక్తులకు సేవలు

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల ప్రజలు అల్పాహారం, ప్రసాద వితరణ చేశారు. పాదయాత్రలో అస్వస్థతకు లోనయ్యే భక్తుల కోసం కమిటీ సభ్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాంబిల్లి మండలం, అచ్యుతాపురం సీఐలు సీహెచ్ నర్సింగరావు, నమ్మి గణేష్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్సైలు అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, యలమంచిలి పోలీసులతో పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో యలమంచిలి, గాజువాక, అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వెళ్లే ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. వాహనదారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

అదృష్ట భాగ్యం



ప్రతి ఏటా కార్తీక పౌర్ణమికి అరుణాచలం, అన్నవరం వంటి క్షేత్రాలకు వెళ్లేవాళ్లం. ఈ సంవత్సరం పంచదార్లలో తొలిసారి గిరి ప్రదక్షిణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాం. శుక్రవారం తెల్లవారుజామునే పుణ్యధారల్లో స్నానమాచరించి కొండమీద ఉన్న స్వామి వారిని దర్శించుకొని గిరి ప్రదక్షిణ చేశాం. ఎంతో మంచి మంచి అనుభూతిని పొందాం. ఏర్పాట్లు బాగున్నాయి.

–ధూళి నానాజీ–నాగమణి దంపతులు, వెంకటాపురం గ్రామం

భక్తి భావాన్ని పెంపొందించింది



పంచదార్ల క్షేత్రం ఎంతో విశిష్టమైనది. ఫణిగిరి పర్వతంపై ధర్మరాజు ప్రతిష్ఠించిన శివలింగం చాలా పవిత్రమైనది. రాధామాధవస్వామి ఆలయం వద్ద కొండపై పవిత్ర పుణ్యధారలు వస్తున్నాయి. ఇలాంటి మహిమ కలిగిన చోట గిరి ప్రదక్షిణ చేయడం మహద్భాగ్యం. ఇది ప్రతి ఒక్కరిలో భక్తి భావాలను పెంపొందించేలా చేసింది. ఈ క్షేత్ర మహత్యం మరింత మందికి తెలియాలి. అప్పుడే స్వామి దర్శన భాగ్యం లభిస్తుంది.

–ధూళి అప్పలనాయుడు, ఆధ్యాత్మిక ధర్మప్రచారకులు, హరిపురం

మరింతమందికి తెలుస్తుంది



పంచదార్ల ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం. గిరి ప్రదక్షిణ వల్ల ఆలయ విశిష్టత మరింత మందికి తెలిసే అవకాశం ఉంది. మొదటిసారే అయినా ఇంత భారీగా ప్రజలు తరలిరావడం చాలా ఆనందంగా ఉంది. ఇది స్వామివారి మహిమకు సంకేతం.

–ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, గోకివాడ గ్రామం

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా బొడ్డేడ, నారాయణమూర్తి




బొడ్డేడ ప్రసాద్



అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా బొడ్డేడ ప్రసాద్, అంకంరెడ్డి నాగ నారాయణ మూర్తిలను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పోక్సో కేసులపై ఎస్పీ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: మిస్సింగ్, పోక్సో కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, పోక్సో కేసులు, మహిళ లు, బాలికల మిస్సింగ్ తదితర దర్యాప్తులో ఉన్న అన్ని కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసు ల్లో సాంకేతిక, ఆధునిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అనుసంధానంతో కోర్టులలో నేరాభియోగ పత్రాలను త్వరితగతిన సమర్పించాలన్నారు. డీఎస్పీలు ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్ పాల్గొన్నారు.

అదనపు పీసీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్ నర్సరీ సందర్శన



సోషల్ ఫారెస్టును పరిశీలిస్తున్న రాహుల్ పాండే

నర్సీపట్నం: నర్సీపట్నం డిపోలో ఉన్న సోషల్ ఫారెస్ట్ నర్సరీని అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ రాహుల్ పాండే శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్క జాతుల గురించి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట విశాఖ కన్జర్వేటర్ మహమ్మద్ దివాన్ మైదీన్, డీఎఫ్‌వో శామ్యూల్, రేంజ్ ఆఫీసర్లు లక్ష్మీనర్సు, సుబ్బారావు, ఫారెస్టర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

● మీడియాయే మాకు అసెంబ్లీ..

ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం

- అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోం
- సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రశ్నించిన గొంతులు నొక్కేందుకు కేసులు, అరెస్టులంటూ భయభ్రాంతులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. చోడవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి.. అధికారంలోని వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కేసులు పెడుతున్న కూటమి ప్రభుత్వం టీడీపీ సోషల్ మీడియా ద్వారా లేనిపోని విమర్శలతో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపైన, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపైన పోస్టులు పెడుతుంటే చూస్తూ ఊరుకుంటుందేమని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఐదు నెలల్లోనే నెరవేర్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిందన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం 2014–19 పదవీ కాలంలో ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకుండానే రూ. 2.8 లక్షల కోట్లు అప్పు చేస్తే.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏటా రూ.75 వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిస్తూ ఐదేళ్లలో 3.2 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం వంటి పథకాలు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల పక్షాన ఆ మోసాలను మీడియా ద్వారా ప్రశ్నిస్తుంటే కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి పనికిమాలిన కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడదని, మీడియాయే తమ పార్టీకి అసెంబ్లీ అని ప్రజల పక్షాన నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు.

చంద్రబాబుపై చీటింగ్ కేసు పెట్టాలి

మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబుపై సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు పెట్టాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సుమారు 6 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి మరలా వాయిదాలు వేస్తూ వస్తుందన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా పాత వాటిలోనే లక్ష పింఛన్ల వరకూ కోత పెట్టారన్నారు. 2024 ఎన్నికల్లో తమ పార్టీకి 40 శాతం మంది ప్రజలు ఓట్లు వేశారని, వారి పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీలు మారిశెట్టి విజయశ్రీకాంత్, దొండా రాంబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అడ్డగింత



రాజయ్యపేటలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

నక్కపల్లి: మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును గ్రామస్తులు అడ్డగించారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుచేయడానికి ట్రాన్స్‌కో సిబ్బంది, కాంట్రాక్ట్‌పొందిన సంస్థ సిబ్బంది శుక్రవారం గ్రామానికి వచ్చారు. ఈవిషయం తెలుసుకుని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు తదితరులు వారి వద్దకు వచ్చి ఈ మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగదారులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని, అమర్చడానికి వీల్లేదని అడ్డుకున్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు, లోకేష్ పిలుపు నిచ్చారని, అధికారంలోకి వచ్చాక ఇవే మీటర్లను ఏవిధంగా ఏర్పాటు చేస్తారని వారు నిలదీశారు. ఈ మీటర్ల వల్ల కలిగే లాభనష్టాలను వివరించకుండా, వినియోగదారులను మోసం చేస్తూ ప్రీపెయిడ్‌మీటర్లను అమర్చడం ఎంతవరకు సమంజసమని వారు నిలదీశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదానీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని వినియోగదారుల నెత్తిన స్మార్ట్‌మీటర్ల భారాన్ని మోపుతోందని ఆరోపించారు.మొదటి విడతలో కేటగిరి 2 వినియోగదారులకు అమరుస్తున్నారని, మిలిగినవారందరికీఈ త్వరలోనే అమరుస్తారని ఆయన చెప్పారు.

పర్యాటకుల భద్రతే ముఖ్యం



బోటులో ప్రయాణించి తీరానికి చేరుకున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌కు వచ్చిన పర్యాటకుల భద్రతే ప్రధానంగా మెరైన్ పోలీసులు విధులు నిర్వహించాలని మెరైన్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. శుక్రవారం సాయంత్రం రుషికొండ బీచ్, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రవివర్మ, డీఎస్పీ బాలరాజుతో కలిసి సందర్శించారు. కార్తీక మాసం కావడంతో రుషికొండ బీచ్‌కు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారని ఈ క్రమంలో మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డ్స్ అప్రమత్తంగా ఉండి వారి భద్రత ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. అదే విధంగా సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. సముద్రంలో ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. బీచ్ కమ్యూనిటీ గార్డ్స్‌తో మాట్లాడుతూ ప్రమాదాలు, రక్షణ తదితర అంశాలు తెలుసుకున్నారు.

మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులు

వేగవంతం చేయాలి

- పీఆర్ అండ్ ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్



మంజూరైన పనులు పరిశీలిస్తున్న పీఆర్ అండ్ ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్ చిత్రంలో డ్వామా పీడీ పూర్ణిమాదేవి

సాక్షి, అనకాపల్లి: ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో భాగంగా మంజూరైన సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ ఎం.శివ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం పెందుర్తి నియోజకవర్గంలో సరిపల్లి, జంగాలపాలెం, పెదగాడి గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పెందుర్తిలోని జిల్లా సమైఖ్య ప్రాంగణంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, క్లస్టరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అదనపు ప్రొగ్రాం అధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్లె పండగ కార్యక్రమంలో భూమి పూజ చేసి ప్రారంభించిన సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆమోదం పొంది ఇంకా పూర్తి కాలేనటువంటి పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

సంక్రాంతి ముందే పూర్తి..

అనకాపల్లి జిల్లాలో మంజూరైన 1142 సీసీ రోడ్లు, 851 గోకులం షెడ్లను..విశాఖ జిల్లాలో 140 సీసీ రోడ్లు, 151 గోకులం షెడ్లను సంక్రాంతికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు ఎఫ్‌టీవోలు జనరేట్ చేస్తే..త్వరగా పేమెంట్ ప్రక్రియ కూడా పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, విశాఖ పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్, డీపీఆర్ఈవో వీరన్నాయుడు, అనకాపల్లి, విశాఖ జిల్లాల సబ్ డివిజనల్ ఇంజినీర్లు, ఏపీడీలు, అదనపు ప్రొగ్రాం అధికారులు, డ్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా సెస్సు వసూళ్లు

- మొబైల్ టీంలతో పర్యవేక్షణ
- ప్రత్యేక చర్యలతో ఎగవేతదారులకు ముకుతాడు
- దిగుబడుల వృద్ధితో పెరగనున్న ఆదాయం



బలిఘట్టంలో ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు

నర్సీపట్నం : లక్ష్య సాధనకు అనుగుణంగా మార్కెట్ కమిటీలో సెస్సు వసూళ్లను ముమ్మరం చేశారు. ఇందుకోసం మార్కెట్ కమిటీల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన దిగుబడులతో లక్ష్యాన్ని అలవోకగా చేరుకోగలమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, మాడుగుల, పాయకరావుపేటలలో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. రైతుల నుంచి పంట కొనుగోలు చేసిన వ్యాపారుల ద్వారా ఈ కమిటీలు సెస్సు వసూలు చేస్తాయి. ఆ నిధులను రైతుల ప్రగతికి వినియోగించేలా ప్రభుత్వం నిర్దేశించింది. ఆరు మార్కెట్ కమిటీల్లో బెల్లం, జీడిగింజలు, ధాన్యం, సరుగుడు, అపరాలు, పసుపుతో పాటు ఇతర ఉత్పత్తుల నుంచి సెస్సు వసూలు చేసేందుకు ప్రభుత్వం ఏటా లక్ష్యం విధిస్తుంది. ఈ ఏడాది జిల్లాలో రూ.9.7 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యంకాగా, ఇప్పటి వరకు రూ.3.24 కోట్లు వసూలు చేశారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లాలో తొమ్మిది చెక్కుపోస్టులు ఏర్పాటు చేశారు. చెక్ పోస్టులకు సమీప ప్రాంతాల్లో పండించిన పంటలకు మాత్రమే సెస్సు చెల్లించేవారు. వీటికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటకు వ్యాపారులు ఎటువంటి సెస్సు చెల్లించకుండా తరలించుకుపోయేవారు. ఈ విషయాన్ని గమనించిన మార్కెట్ కమిటీ అధికారులు ఈ ఏడాది గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. తద్వారా ఇప్పటి వరకూ సెస్సు చెల్లించకుండా జేబులు నింపుకున్న వ్యాపారులకు మార్కెటింగ్ శాఖ ముకుతాడు వేయగలిగింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి నాలుగు నెలలు సమయం ఉన్నందున అనుకున్న మొత్తాన్ని వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

మార్కెట్ల కమిటీల వారీగా లక్ష్యం, వసూళ్ల వివరాలు

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లు)	వసూళ్లు (రూ.లక్షలు)
నర్సీపట్నం	2.00	68.27
అనకాపల్లి	1.93	74.56
చోడవరం	0.96	23.15
యలమంచిలి	1.96	75.12
పాయకరావుపేట	1.68	75.12
మాడుగుల	0.54	20.30

లక్ష్యాన్ని అధిగమిస్తాం...



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు రూ.3.24 కోట్లు వసూలు అయింది. సివిల్ సప్లయి నుంచి కొంత సొమ్ము రావాల్సి ఉంది. మిగిలిన నాలుగు నెలల కాలంలో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు ఊపందుకుంటాయి. లక్ష్యాన్ని అధిగమిస్తాం.

– రవికుమార్, జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

డీఎస్సీకి ఉచిత శిక్షణ

నర్సీపట్నం: డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ సంక్షేమ సహాయ అధికారి వి.గోపీనాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ శిక్షణ కోసం ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ రూ.1500, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్క్సులిస్టులు, డీఎడ్, బీఎడ్, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రులు వార్షిక ఆదాయం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరిచి అనకాపల్లి డిస్ట్రిక్ట్ కార్యాలయానికి పంపించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 98858 45743లో సంప్రదించాలన్నారు.

ఏలేరు కాలువలో వివాహిత మృతదేహం

అనకాపల్లి: అదృశ్యమైన వివాహిత ఇ.సూర్య భవాని (35) మృతదేహం తుమ్మపాల పంచాయతీ పరిధి ఏలేరు కాలువలో శుక్రవారం లభ్యమయింది. ప్రమాదవశాత్తు కాలువలో కాలు జారి పడిపోయినట్లు భావిస్తున్నామని పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు చెప్పారు. బుచ్చెయ్యపేట మండలం ఐతంపూడి గ్రామానికి చెందిన సూర్య భవాని కుటుంబ సభ్యులతో తుమ్మపాల ఇందిరా నగర్‌లో నివసిస్తోందని, ఈనెల 14 నుంచి కనిపించడం లేదని పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు అందిందని ఎస్ఐ చెప్పారు. శుక్రవారం ఏలేరు కాలువలో సూర్యభవాని మృతదేహం కనిపించడంతో పట్టణ పోలీస్‌లకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, మృతురాలి సోదరుడు ఎ.వెంకటసాయి జనార్దన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

డీఎస్సీ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: డీఎస్సీకి దరఖాస్తు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ కార్యక్రమంలో బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎడ్, పీజీ విద్యార్హతలు కలిగి ఉండాలని, అనుభవజ్ఞులైన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. దరఖాస్తులను రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజ్ స్ట్రీట్, డోర్ నంబర్ 10-06-31/7, అనకాపల్లి చిరునామాలో గల కార్యాలయానికి ఈ నెల 18వ తేదీ లోగా పంపాలని తెలిపారు. ఇతర వివరాలకు 8247036596, 9885845743 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

సిటీలు సింగపూర్‌లు కావాలంటే
ఆర్కిటెక్ట్స్‌కు అవకాశమివ్వాలి

సాక్షి ఇంటర్వ్యూ


రాజేష్ నాగుల

- దేశంలో నిపుణుల కొరత లేకపోయినా అవకాశాలు సన్నగిల్లుతున్నాయి
- ప్లానింగ్ చట్టంలో మార్పులు చేస్తేనే అద్భుతాలు
- ప్రభుత్వ ప్రాజెక్టులకీ ఆర్కిటెక్ట్స్‌ని వినియోగించడం లేదు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ ఛైర్మన్ రాజేష్

సాక్షి, విశాఖపట్నం : దేశ వ్యాప్తంగా చేపట్టే ప్రభుత్వ ప్రాజెక్టులకు నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌కు అవకాశాలు కల్పిస్తే.. సిటీలన్నీ సింగపూర్‌లుగా మారతాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ సెంటర్ ఛైర్మన్ రాజేష్ నాగుల స్పష్టం చేశారు. దేశంలో ఆర్కిటెక్చర్ నిపుణుల కొరత లేకపోయినప్పటికీ అవకాశాలు మాత్రం సన్నగిల్లుతుండటంతో.. కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, జనాభాను అంచనావేస్తే భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా ఆర్కిటెక్ట్‌లకు అనూహ్య డిమాండ్ ఉంటుందన్నారు. నగరంలో జరిగిన ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ ఎక్స్‌పో (ఏఐ ఎక్స్‌పో)-2024ను రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్చర్ కోర్సులకు సంబంధించిన అవకాశాలు, ప్రస్తుత పరిణామాల్ని 'సాక్షి'కి వెల్లడించారు.

కెరీర్ అద్భుతంగా ఉంటుంది

బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ ప్రచురించిన తాజా నివేదిక ప్రకారం, భారతదేశంలో ఆర్కిటెక్ట్స్‌కు ఉపాధి రేటు 2020-30 మధ్య అంటే ఈ దశాబ్ద కాలంలో 1% పెరుగుతుందని అంచనా వేశారు. 2030 నాటికి దేశ జనాభా 1.5 బిలియన్లకు చేరుబోతున్న తరుణంలో.. ఇళ్ల నిర్మాణాలు, కార్యాలయ స్థలం, ఇతర మౌలిక సదుపాయాల అవసరం పెరుగుతూనే ఉంటుంది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఆర్కిటెక్చర్‌ను అభ్యసించాలనుకుంటే ఏ విద్యార్థికైనా ఈ రంగంలో కెరీర్ వృద్ధి చాలా ఆశాజనకంగా కనిపిస్తుంది. ముఖ్యంగా.. దేశంలో పెరుగుతున్న నిర్మాణ పరిశ్రమ, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా ఆర్కిటెక్ట్స్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. పట్టణీకరణ, స్థిరమైన , ఇంధన-సమర్థవంతమైన భవనాలపై పెరుగుతున్న ఆసక్తి.. ఆర్కిటెక్చర్‌లో అవకాశాల్ని పెంపొందిస్తున్నాయి. ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పెరుగుతున్న అవగాహనతో, భారతదేశంలో స్థిరమైన ఆర్కిటెక్చర్‌కు గణనీయమైన డిమాండ్ ఉంది.

అప్పుడే సిటీలు సింగపూర్‌లుగా మారతాయి

ఆర్కిటెక్ట్స్‌లను వినియోగించుకోకపోవడంతో ఈ కోర్సుల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. అందుకే దేశ వ్యాప్తంగా ఆర్కిటెక్ట్స్ కాలేజీలు మూతపడుతున్నాయి. ఏపీలో రెండు కాలేజీల్ని మూసేసుకున్నారు. అవకాశాలున్నా వాటిని కల్పించడంలో విఫలమవుతున్నాం. ఉదాహరణకు ప్రభుత్వాలు కూడా ఆర్కిటెక్ట్స్‌ని సరిగా వినియోగించుకోవడం లేదు. కొన్ని ప్రభుత్వ ప్రాజెక్టులకు కూడా ఆర్కిటెక్ట్స్‌ల స్థానంలో సివిల్ ఇంజినీర్లపైనే ఆధారపడుతున్నారు. ఇందులో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం ఇంకా వెనకబడి ఉంది. 2002లో ఇచ్చిన ప్రభుత్వ జీవో ప్రకారం 300 చ.మీ.కంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే ఆ డిజైన్‌పై ఆర్కిటెక్ట్స్ సంతకం ఉండాలనే రూల్ పెట్టారు. 2012 తర్వాత ఆ క్లాజ్‌ని తీసేశారు. అప్పటి నుంచి వీరికి ప్రాధాన్యత రాష్ట్రంలో తగ్గిపోయింది. ఇప్పుడు రెరా చట్టం ప్రకారం 500 చ. గజాల పైన ఉండే ప్రతి ప్లాన్‌పైనా వీరి సంతకం ఉండాలి. దానికి ఆర్కిటెక్ట్స్ అవసరమైనప్పుడు మిగిలిన వాటికి ఎందుకు ఉండకూడదు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నాం. ప్రభుత్వ ప్రాజెక్టులకు, 500 చ.గజాలపైన ఉండే ప్రతి భవనానికి ఆర్కిటెక్ట్స్‌ని వినియోగించాలని వినతి పత్రం అందించనున్నాం. సింగపూర్, హాంకాంగ్ దేశాల్లో ఆర్కిటెక్ట్స్‌పైనే ప్రతి ప్రాజెక్టు ఆధారపడి ఉంటుంది. సింగపూర్ లో చిన్న భవనానికైనా ఆర్కిటెక్ట్స్ అవసరం. అలాంటి చట్టాలు తీసుకొస్తేనే మన సిటీలు కూడా సింగపూర్‌లు అవుతాయి.

నైపుణ్యం ఉంది.. అవకాశాలు కల్పించాలి

దేశంలో నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌లున్నారు. విశాఖలో 200కిపైగా ఆర్కిటెక్ట్స్‌లున్నారు. శ్రీకాకుళంలో 50 మంది నర్సీపట్నంలో 10 మంది వరకూ ఉన్నారు. ఏపీలో మొత్తంగా 800కిపైగా నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌లున్నారు. కానీ అవకాశాలు ఆశించిన మేర రావడం లేదు. 1990ల మధ్యకాలం నుంచి దేశంలో పట్టభద్రులవుతున్న ఆర్కిటెక్ట్స్‌ల సంఖ్య రెట్టింపు అయింది. 1972లో కేవలం 12 ఆర్కిటెక్చర్ ఇన్‌స్టిట్యూట్స్ ఉండగా.. భారతదేశం ఇప్పుడు సుమారు 500 వరకూ ఉన్నాయి. ప్రతి సంవత్సరం 20,000 మంది గ్రాడ్యుయేట్స్ వస్తున్నారు. అందుకే అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే సత్తా ఏపీ ఆర్కిటెక్ట్‌లకు ఉంది.

ఇంజినీర్లు వేరు.. ఆర్కిటెక్ట్స్‌లు వేరు..

1998 తర్వాత నుంచి ఏఐ ఎక్స్‌పో ప్రారంభించి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. 2005 నాటికి ఆర్కిటెక్ట్స్‌లకు గుర్తింపు వచ్చింది. అయితే ఇప్పుడు సివిల్ ఇంజినీర్లు కూడా ఆర్కిటెక్ట్స్‌లుగా చలామణి అయిపోతున్నారు. ఇది ఆర్కిటెక్ట్ చట్టం ప్రకారం తప్పు. ఇంజినీర్లు బిల్డింగ్ ప్లాన్ ఇవ్వొచ్చు. కానీ..ఆర్కిటెక్ట్స్‌గా చెప్పుకోవడం సరికాదు. సివిల్ ఇంజినీర్లతో కలిసి ఆర్కిటెక్ట్స్‌లు పనిచేస్తేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. ఆర్కిటెక్ట్స్ అంటే ఎవరు, ఇంజినీర్ ఎవరనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కౌన్సిల్ తరపున నిర్వహించనున్నాం.

ఆర్కిటెక్చర్.. అదిరింది


ఏయూ ఆర్కిటెక్చర్ విద్యార్థులు రూపొందించిన నమూనాలు


ఇంటీరియర్ డిజైన్

ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైన్లను ప్రదర్శిస్తూ.. భవిష్యత్తులో ఆర్కిటెక్ట్స్ పాత్ర ఎంత ముఖ్యమో తెలియజెప్పేందుకు నగరంలో ఏఐఎక్స్‌పో-2024 శుక్రవారం ప్రారంభమైంది. ది ఇండియన్ ఇనిసిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ ఎక్స్‌పోలో దేశంలోని ప్రసిద్ధి చెందిన ఇంటీరియర్ డిజైన్ సంస్థలు తమ ఉత్పత్తుల్ని ప్రదర్శనకు ఉంచాయి. సెన్సార్‌తో పనిచేసే కమోడ్స్, అద్భుతమైన గ్లాస్ డిజైన్‌లు, టైల్స్, తేలియాడే ఇటుకలు, బాత్ టబ్స్, షవర్ టవర్స్... ఇలా భిన్నమైన మోడల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి.


ప్రదర్శనలో వివిధ నమూనాలు


భిన్నమైన ఇంటీరియర్ డిజైన్లు

వెనక్కి వెళ్లిన సముద్రం


జోడుగుళ్లపాలెం వద్ద వెనక్కి వెళ్లిన సముద్రం

ఏయూక్యాంపస్: విశాఖలో సముద్రం వెనక్కి వెళ్లింది. ప్రతీ పౌర్ణమి, అమావాస్య రోజుల్లో సముద్రం ఆటుపోట్లకు గురవుతుంది. ఈ సమయంలో సముద్రం కొంత వెనక్కి వెళ్లడం, ముందుకు రావడం జరుగుతుంటుంది. శుక్రవారం పౌర్ణమి కావడంతో జోడుగుళ్లపాలెం, పాండురంగాపురం, ఆర్.కె బీచ్ తదితర ప్రాంతాలలో సముద్రం వెనక్కి వెళ్లి రాళ్లు బయటకు కనిపించాయి. దీంతో పర్యాటకులు, నగరవాసులు రాళ్లపైకి వెళ్లి ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు.

నావిక్ సెల్ 21పై వీపీఏ సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ నావిక్ సెల్ 21పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి పోర్ట్ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అధ్యక్షత వహించారు. పలు మంత్రిత్వ శాఖలు, సంబంధిత సంస్థల నుంచి సీనియర్ అధికారులు దీనికి హాజరయ్యారు. నావిక్ సెల్‌కు సంబంధించి గత సమీక్షా సమావేశాల్లో కేంద్ర నౌక, జల రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి అందించిన మార్గదర్శకాల అమలు, మంత్రిత్వ శాఖల సహకారం, సముద్ర రంగానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై ఇందులో చర్చించారు. నౌకాయాన రంగంలో ముఖ్యమైన అంశాలపైన సమగ్రమైన విధానాలను రూపొందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో రైల్వే, హోం, పర్యావరణ, అటవీ, రోడ్డు రవాణా, హైవేస్, పునరుత్పాదక శక్తి వంటి వివిధ మంత్రిత్వ శాఖల నుంచి సంబంధిత విధానాలు, చట్టాలు, మార్గదర్శకాలను కూడా పరిశీలించారు.

గంజాయి కేసులో ఐదుగురికి పదేళ్ల జైలు

చోడవరం రూరల్: గంజాయి రవాణాకు పాల్పడిన ఐదుగురు నిందితులకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా అందచేసిన వివరాల ప్రకారం.. చీడికాడ మండలం బయలుపూడి గ్రామానికి చెందిన నిందితులు జాజిమొగ్గల సంతోష్, వద్దాది రమణ, పెదబయలు మండలం కిముడిపల్లి గ్రామానికి చెందిన సీచర్ల సుబ్బారావు, చింతాడ లక్ష్మయ్య, కొర్రా బాబురావులు 120 కేజీల గంజాయిని నాలుగు మూటలలో రవాణా చేస్తూ పట్టుబడ్డారు. 2015లో చీడికాడ సమీపంలో ఎస్ఐ డి.విశ్వనాథానికి అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఐదుగురి నుంచి నాలుగు మూటలలో 120 కేజీల గంజాయిని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నిందితులపై మోపిన నేరారోపణ అభియోగం పూర్వాపరాలను, సాక్షులను విచారించిన మీదట నిందితులు ఐదుగురిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఉగ్గిన వెంకటరావు తన వాదనలు వినిపించారు. ఎస్ఐ విశ్వనాథం, పీపీ వెంకటరావు, సిబ్బందితోపాటు కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

పండగను తలపించేలా బిర్సా ముండా జయంత్యుత్సవం

నాతవరం: జిల్లాలో ఆరు మండలాల్లో భగవాన్ బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించామని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.నాగశిరీష చెప్పారు. సరుగుడు పంచాయతీలో శుక్రవారం బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నాతవరం, రావికమతం, నక్కపల్లి, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించామన్నారు. ఆయా మండలాల పరిధిలో 10 గ్రామ పంచాయతీలను గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో అభివృద్ధి చేసేందుకు ఈరోజు నుంచి ఈనెల 26వ తేదీ వరకు గ్రామసభల ద్వారా శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. ఈ పథకంలో ఎంపిక చేసిన గిరిజన పంచాయతీల్లో శత శాతం అభివృద్ధిని 2029 లోపు సాధించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గిరిజనులకు ఏళ్ల తరబడి వెంటాడుతున్న రెవెన్యూ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు.

పాడేరు ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు కల్పిస్తున్న సదుపాయాలు మైదాన ప్రాంత గిరిజనులకు కూడా వర్తింపజేయాలన్నారు. నాతవరం మండలంలో ఉన్న గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధి కొయ్యూరు మండలంలో విలీనం చేయాలన్నారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్రామసభ సరుగుడు సర్పంచ్ గంగరాజు అధ్యక్షతన జరిగింది. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి ప్రశాంతి, నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, సుందరకోట సర్పంచ్ కొండపల్లి చింతల్లి మండలంలో గల అన్ని శాఖలు అధికారులు పాల్గొన్నారు.


గిరిజన సంక్షేమశాఖ డీడీ నాగ శిరీషకు సత్కారం


గిరిజన బాలికల థింసా నృత్యం

బంగారం, నగదు చోరీ


సంఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్


ఎస్.రాయవరం: మండలంలోని గెడ్డపాలెంలో ఓ ఇంట్లో దొంగలు పడి మూడున్నర తులాల బంగారం, రూ.10 వేల నగదు చోరీ చేశారు. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9న గ్రామానికి చెందిన కర్రి శాంతికుమార్ బంధువు చనిపోయారు. దీంతో మైలు పట్టిన శాంతికుమార్ కుటుంబ సభ్యులు అప్పటి నుంచి ఇంట్లోకి వెళ్లలేదు. శుక్రవారం ఇంటిని శుభ్రం చేయడానికి శాంతికుమార్ మేనకోడలు వెంకట నవదుర్గ ఇంట్లోకి వెళ్లింది. వస్తువులు చిందరపడిఉండడం గమనించి కుటుంబ సభ్యులకు చెప్పింది. బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం


నక్కాదేవి

గొలుగొండ: అమ్మగారి ఇంటికి వచ్చి ఒక వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ రామారావు అందించిన వివరాలు.. నక్కా దేవి (24) రోలుగుంట మండలం కంచుగొమ్మల గ్రామంలో భర్తతో కలిసి ఉంటోంది. గత నెల 27న అత్తగారి ఇంటి నుంచి బయలుదేరి తల్లి గారి గ్రామమైన అమ్మపేట వచ్చింది. అక్కడి నుంచి ఈనెల 13న బయటకు వెళ్లి మళ్లీ ఇంటికి రాలేదు. రెండు రోజుల నుంచి వెతికినా ఆచూకీ లేకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆమె సమాచారం తెలిసినవారు 9440904215 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

యలమంచిలి రూరల్: యలమంచిలి-నర్సింగపల్లి రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో 726/8 కిలోమీటరుకు సమీపంలో రైలు నుంచి జారిపడి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (40)మృతి చెందినట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. తెలుపు రంగు మీద నలుపు అడ్డ చారల ఫుల్ చేతుల చొక్కా, నీలం రంగు ట్రాక్ ధరించి ఉన్న మృతుని చిరునామా, ఇతర వివరాలేవీ తెలియలేదని ఆయన చెప్పారు. మృతదేహం వద్ద గురువారం మధ్యాహ్నం సామర్లకోట నుంచి విశాఖపట్నం వరకు వెళ్లడానికి కొనుగోలు చేసిన జనరల్ టికెట్ లభించిందని చెప్పారు. మృతదేహం ఉన్నచోట ఎటువంటి మార్గాలు లేకపోవడంతో సుమారు కిలోమీటరున్నర దూరం తమ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని మోసుకొచ్చామని ఎస్ఐ తెలిపారు. ప్రమాదవశాత్తు ఏదో రైలుబండి నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.మృతుడు ఉమ్మడి తూర్పుగోదావరి,ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలకు చెందినవాడై ఉండవచ్చని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫోన్ నంబర్ 9490619020)ను సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నా భర్త మృతిపై నిగ్గు తేల్చండి

- స్టీల్ ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్ తాతారావు భార్య బంగారమ్మ వేడుకోలు
- పోలీసులు, యాజమాన్య ద్వంద్వ వైఖరితో ఆర్థిక ప్రయోజనాలు కోల్పోయాం


వివరాలు వెల్లడిస్తున్న తాతారావు భార్య బంగారమ్మ

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన నాట్రా తాతారావు మృతిపై నిజాలు వెలికితీయాలని అతని భార్య బంగారమ్మ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2017 జూలై 11న కొంత మంది తాతారావును హత్య చేయించి, ప్రమాదవశాత్తు చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారని.. కుళ్లిన మృతదేహాన్ని మూటకట్టించి జూలై 15న కేజీహెచ్ మార్చురీ నుంచి తమకు పంపించారని ఆమె ఆరోపించారు. అదే నెల 28న తాతారావు మృతిపై అనుమానాలున్నాయంటూ నగర పోలీసు కమిషనర్, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి లేఖ రాశారన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పోలీసులు ఎందుకు నాటకాలు ఆడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. చివరకు తాతారావు మృతిలో ఎటువంటి అనుమానాలు లేవని పోలీసు కమిషనర్ ఉక్కు యాజమాన్యానికి స్పష్టం చేశారని, దీని వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు. తన భర్త మృతికి గల కారణాలు తెలియవని చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చెబుతుండగా.. తాతారావు మృతి ప్రమాదవశాత్తు జరిగింది కాదంటూ ఉక్కు యాజమాన్యం మరోలా చెబుతోందన్నారు. విధులు నిర్వహిస్తుండగా తన భర్త చనిపోకపోతే మృతదేహాన్ని స్టీల్‌ప్లాంట్‌లో 27 మీటర్ల ఎత్తులోకి ఎవరు తీసుకొచ్చారని ప్రశ్నించారు. కుటుంబ పోషణకు తన వారసులకు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో ఓ హోటల్‌లో పాచి పనులు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సంఘం నేత నిమ్మకూరి రమేష్ మాట్లాడుతూ తాతారావు కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన వారసుడికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం కార్యకర్త కాసా పద్మరాజు పాల్గొన్నారు.

ఏరోస్పేస్ శిక్షణకు 50 మంది ఎంపిక


శిక్షణకు ఎంపికైన పెందుర్తి విద్యార్థులు

పెందుర్తి: ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ శిక్షణ తరగతులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఏరోస్పేస్ విభాగంలో 6 నెలల శిక్షణ తరగతులకు గానూ రాత పరీక్షలు నిర్వహించారు. విశాఖ, పెందుర్తి, శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 100 విద్యార్థులు పాల్గొనగా వీరిలో విశాఖ కళాశాల నుంచి 30 మంది, పెందుర్తి కళాశాల నుంచి 15 మంది, శ్రీకాకుళం నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. వీరికి అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రంలో శిక్షణ ఇస్తారని సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి రామకృష్ణ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సికింద్రాబాద్-లక్నో స్పెషల్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం: ఇటీవల ప్రకటించిన సికింద్రాబాద్-లక్నో-సికింద్రాబాద్(07084/07083) స్పెషల్ ట్రిప్‌ను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 22న సికింద్రాబాద్-లక్నో(07084) స్పెషల్, ఈ నెల 25న లక్నో-సికింద్రాబాద్ (07083) స్పెషల్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు వరాహలక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి చందనంతో అలంకరించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు లక్ష్మీ అండాళ్ అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి సన్నిధిలో దీపాలంకరణ సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: స్థానిక విద్యుత్‌శాఖ డి-1 సెక్షన్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూడిమడక రహదారి, శారదాకాలనీ, నెహ్రూచౌక్ జంక్షన్, న్యూ కాలనీ, జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఏరియా, తహసీల్దార్ కార్యాలయం ఏరియా, పాత బర్మాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

పాయకరావుపేట వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు పొడిగించాలి

అనకాపల్లి: విశాఖ నుంచి చేపట్టబోయే మెట్రోరైలు ప్రాజెక్టు పనులను అనకాపల్లి, నర్సీపట్నం మీదుగా పాయకరావుపేట వరకూ పొడిగించాలని ఆమ్‌ఆద్మీపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు కోరారు. స్థానిక ఉడ్‌పేట పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు విశాఖ నుంచి అనకాపల్లి, నర్సీపట్నంమీదుగా పాయకరావుపేట వరకూ మెట్రోరైలు ప్రాజెక్టును పొడిగించాలన్నారు.

నేటి నుంచి సత్యసాయిబాబా జయంతి వేడుకలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నిదానందొడ్డిలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకూ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె.వి.మహేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.16వ తేదీ తెల్లవారుజామున 4.45 గంటలకు సుప్రభాతం, నగర సంకీర్తన, 6 గంటలకు సాయిగాయత్రీ పారాయణం, షిర్డీసాయిబాబా చాలీసా పారాయణం, 9 గంటలకు సత్యసాయిబాబు పతాకావిష్కరణ, కలశస్థాపన, రాత్రి 7 గంటలకు నా మ సంకీర్తన నిర్వహించనున్నట్టు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 2,268 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,660	4,360
మొదటి రకం	3,640	4,350
రెండో రకం	3,450	3,880
మూడోరకం	3,100	3,400

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-4 యూనిట్లు, బి పాజిటివ్-12 యూనిట్లు, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని దించవచ్చు.

పరమ చెత్తగా..


పారిశుధ్య సిబ్బంది రోడ్డు పక్కన పడేసిన చెత్త

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాల నిర్వహణ అటకెక్కింది. అనకాపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

- **నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు**
- శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు
- మందుబాబులకు అడ్డాగా షెడ్‌లు
- నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- రోడ్ల పక్కనే చెత్త డంపింగ్


గొలంగాంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం


గొలగాం సంపద కేంద్రంలో ఖాళీమద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు

తుమ్మపాల: పల్లెలను పరిశుభ్రంగా తయారుచేయాలి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సంపద సృష్టించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి పల్లెలోను సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ కేంద్రాల్లో కంపోస్టు ఎరువులు తయారుచేసి, రైతులను విక్రయించాల్సి ఉంది. గ్రామాల్లో వర్మీ కంపోస్టుకు మంచి డిమాండ్ ఉంది. పారిశుధ్యం నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నుంచి ఒక్కో కేంద్రానికి దాదాపు రూ.20 లక్షలు వరకు ఖర్చు చేశారు. చెత్త సేకరణకు బ్యాటరీ బళ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువగా ఉంటే అదనపు ట్రాక్టరు, గాజు సీసాలు పొడి చేయడానికి ప్రత్యేక యంత్రాలు సమకూర్చడంతో పాటు హరిత రాయబారులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హరిత రాయబారులను క్లీన్ మిత్రలుగా పేరు మార్చింది. గ్రామవీధుల్లో నుంచి చెత్తను సేకరించి, తడి, పొడి చెత్తతో పాటు గాజు పెంకులు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టిల్లో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రియ ఎరువు తయారు చేసి, రైతులకు కిలో రూ.4కు విక్రయించాలని ప్రభుత్వ ఉద్దేశం.అయితే ప్రస్తుత కూటమి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ లక్ష్యం నీరుగారింది.

చెత్త తరలింపునకు వాహనాలే లేవు...

మండలంలో దాదాపు ప్రతి గ్రామంలోను చెత్త సేకరణ కేంద్రం (సంపద కేంద్రం) ఉంది. మండలంలో 32 గ్రామపంచాయతీలకు గాను ఏడు మినహా మిగిలిన 25 కేంద్రాలు సిద్ధమయ్యాయి. వాటిలో 14 కేంద్రాల నిర్వాహణ జరుగుతోందని అధికారులు చెబుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. 11 కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ వాహనాలు లేక చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం లేదు. సేకరించిన చెత్తను గ్రామ శివారు ప్రాంతాల్లో పోగుచేసి కాల్చివేస్తున్నారు. కొన్ని చోట్ల గోతుల్లో వేసి క్రషర్ బుగ్గితో కప్పేస్తున్నారు.


రేబాకలో అసంపూర్తిగా నిలిచిపోయిన సంపద తయారీ కేంద్రం

రోడ్డు పక్కనే చెత్త



చెత్త సేకరణ కేంద్రాలు పేరుకే నిర్మించినట్టయింది. మా గ్రామంలో చెత్త సేకరణ కేంద్రం నిరుపయోగంగా ఉంది. వీధుల్లో చెత్తను సేకరించి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో దోమల వ్యాప్తి చెంది రోగాలు బారిన పడుతున్నాం. వాహనాలు లేకపోవడంతో చెత్తను సంపద కేంద్రానికి తరలించలేకపోతున్నామని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. వారికి కనీసం బ్యాటరీ వాహనాలు అందిస్తే చెత్తను తరలించగలరు.

–కోన లక్ష్మణ, సత్యనారాయణపురం

కేంద్రాలన్నింటినీ నిర్వహణలోకి తెస్తాం

మండలంలో అన్ని పంచాయతీల్లోను సంపద కేంద్రాల ద్వారా చెత్త సేకరించి కర్మీ కంపోస్టు తయారుచేయడానికి ప్రభుత్వం మార్గ నిర్దేశకాలు పాటిస్తున్నాం. 14 గ్రామాల్లో సంపద కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన నిర్వాహణలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

–ప్రసాద్, ఈవోపీఆర్‌డీ, అనకాపల్లి మండలం

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

అనకాపల్లి: రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అన్ని కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు విద్యుత్ వినియోగదారుల అనుమతి లేకుండా గృహాలకు మీటర్లు బిగించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ప్రజలు అడ్డుకున్నారని, జిల్లాలో ఎక్కడ స్మార్ట్‌మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడాన్ని అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ మాట మార్చి స్మార్ట్‌మీటర్లు బిగించే విధంగా చర్యలు చేపట్టడం అన్యాయమని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థతో కుమ్మక్కై వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతూ ఒప్పందాలు చేసుకుని మీటర్ల ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టిందని ఆరోపించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పడుతుందని తెలిపారు. ప్రతి మీటరుకు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో కోట్లాది రూపాయలు వినియోగదారుల నుంచి వసూలు చేయడం అన్యాయమన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌ను ఎగనామం పెట్టేందుకు టీడీపీ చర్యలు చేపట్టిందన్నారు. రూ.17వేలకోట్ల ట్రూ అప్ చార్జీల భారం ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిందని తెలిపారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఊరేగింపు


కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


అమ్మవారి ఆలయంలో కలశకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరిలో అమ్మవారి ప్రతిష్ట శత వార్షికోత్సవం, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు పట్టణం వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అమ్మ వారి మూల విరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన గుమ్మడి అమ్మలు పేరంటాల జాతర


అమ్మవారి వేషధారణలో కళాకారులు


అమ్మవారి ఘటాన్ని శిరస్సున పెట్టుకుని తీసుకొని వెళుతున్న భక్తుడు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గుమ్మడి అమ్మలు పేరంటాల జాతర శుక్రవారం ఘనంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భారీ ఊరేగింపుతో ఆలయానికి తీసుకువచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అంతకుముందు అమ్మవారి ఘటాన్ని సుందరపు కుటుంబ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగించారు. అమ్మవారిని పూలు, పసుపు కుంకుమలతో అలంకరించి, మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలో కాళీకాదేవి వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కేరళ నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారి వేషధారణతో అలరించారు.

బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రోత్సాహం

కోటవురట్ల: ఉపాధి హామీ పథకం నిధులతో బహువార్షిక పశు గ్రాసాల సాగు కోసం పాడి రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు ఏపీవో నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశు సంవర్ధకశాఖ సమన్వయంతో పథకాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా పశు గ్రాస సాగుకు ఒక్కో రైతుకు కనిష్ఠంగా 0.10 సెంట్లు, గరిష్ఠంగా 0.50 సెంట్లు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. 0.50 సెంట్లకు గాను రెండేళ్లకు లేబర్ చార్జీగా రూ.14,250, ఎరువులు, పశుగ్రాస కణుపుల కొనుగోలుకు రూ.11,788 చొప్పున నిధులు జమ అవుతాయని తెలిపారు. సొంత భూమి, వ్యవసాయ బోరు కలిగి ఉన్న రైతులు మాత్రమే ఇందుకు అర్హులుగా తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గరలో ఉన్న వీఆర్పీ, రైతు సేవా కేంద్రంలోని పశు సహాయకుడుని సంప్రదించాలని సూచించారు.

శబరిమల యాత్రకు అయ్యప్పస్వాములు


గవరపాలెం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న స్వాములు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి అయ్యప్పస్వామి పీఠం భక్తులు శుక్రవారం శబరిమల యాత్రకు బయలు దేరారు. పట్టణ పరిధిలో స్వాములు అనకాపల్లి నుంచి శబరిమలకు రైళ్లు, బస్సుల్లో బయలు దేరారు. ఇరుముడి ధరించి, గవరపాలెం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మెకాలపు జీతాలు ఇవ్వాలి

అనకాపల్లి: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది డిసెంబర్‌లో 21 రోజులు సమ్మె చేశామని, ఆ సమ్మెకాలపు జీతాలను వెంటనే విడుదల చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధి తట్టా కృష్ణ, బి.అచ్యుతకృష్ణ, జి.నూకేశ్వరరావులు కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలని, తద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని పెనుగొల్లు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ మూర్తి తెలిపారు. కొత్తరేవుపోలవరంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల కారణంగా ఎక్కువ శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. అనంతరం పలువురి నివాసాలకు వెళ్లి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు.

108 ఉద్యోగుల సమ్మె సైరన్


తహసీల్దార్ కె వరహాలుకు సమ్మె నోటీసు ఇస్తున్న 108 వాహనం సిబ్బంది

యలమంచిలి రూరల్: అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు.ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 నుంచి సమ్మె చేయనున్నట్టు అధికారులకు నోటీసు ఇచ్చారు.స్థానిక మండల రెవెన్యూ,మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్ కె.వరహాలు,ఎంపీడీవో కొండలరావులకు వేర్వేరుగా సమ్మె నోటీసులు అందజేశారు. యలమంచిలి పరిధిలో 108 అంబులెన్స్ వాహనాల్లో పనిచేస్తున్న ఈఎంటీ,పైలట్లకు గ్రాట్యుటీ,ఆర్జిత సెలవుల సొమ్ము,వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలని,108 వాహనాల నిర్వహణను ప్రభుత్వమే చూడాలని,సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి నెల 5వ తేదీన వేతనాలు చెల్లించాలన్న డిమాండ్లను సమ్మె నోటీసులో పేర్కొన్నారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సిబ్బంది కోరారు.ఈ కార్యక్రమంలో జి.సునీల్‌కుమార్, ఎన్.నవీన్, బి.సాయిసుభాష్,సీహెచ్.నాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్

అనకాపల్లి: గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని ఆర్జించవచ్చని అనకాపల్లి సబ్ జైలు సూపరింటెండెంట్ డి.అనిల్‌కుమార్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక శాఖవీధి శాఖాగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి శ్రీనివాసరావు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


షిర్డీ సాయిబాబా


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న రత్నాకర్

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు ఎన్‌జీవోఎస్ కాలనీలో షిర్డీ సాయినాథ్ మందిర 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి అధిక సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.ప్రసాద్, కోశాధికారి రేపాకరామ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతి

అనకాపల్లి: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, కార్యదర్శి కె.వరలక్ష్మి, కోశాధికారి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్త హీనత నివారణకు చర్యలు


ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో వైద్య విభాగం జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్యరాలు లూసి కార్డిలియా

అనకాపల్లి: గర్భిణులు, కౌమార బాలికల్లో రక్త హీనత నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య విభాగం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం వైద్యరాలు లూసి కార్డిలియా ఆదేశించారు. స్థానిక గవరపాలెం అరుంధతినగర్ యూపీహెచ్‌సీని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్‌సీడీ 3.0 సర్వేను సకాలంలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు, మేనేజర్ జగన్నాథరావు, యూపీహెచ్‌సీ వైద్యుడు జయదీప్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు


వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు


బ్రాహ్మణులకు స్వయంపాకం అందజేస్తున్న భక్తులు

అనకాపల్లి: పట్టణ, మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, అరటిపళ్ల మార్కెట్ వద్ద సాధువుల శివాలయం, గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయం, పెదరాజుపేట సాంబశివుని ఆలయం, గాంధీనగరం శారదానది ఒడ్డున ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటికిటలాడాయి. మహిళా భక్తులు ధ్వజ స్తంబాల వద్ద దీపారాధన చేశారు. తెల్లవారు జామునుంచి స్థానిక శారదానదిలో పుణ్యస్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల వద్ద రాత్రి జ్వాలాతోరణం వెలిగించారు. ఈ తోరణం కింద నుంచి నడిస్తే సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. మండలంలో శీరంశెట్టివానిపాలెం, మారేడుపూడి, గోపాలపురం, బవులవాడ, మామిడిపాలెం, ఎ.కె.ఎస్.ఆర్.పేట, కొత్తూరు, తగరంపూడి, సీతానగరం తదితర ప్రాంతాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆకాశదీపం వెలిగించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈవోలు, పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.


శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



అనకాపల్లిలో జ్వాలా తోరణం